



# కరపత్రం

SINCE 2014

గురువారం ఆగస్ట్ 7 2025 | సంపుటి :0 | సంచిక :293 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు.

## 'గల్వాన్' ఘటన తర్వాత తొలిసారి!



దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సు లో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే.

తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది.

చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

మరోవైపు భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. రష్యాతో ముడిచమురు కొనుగోలును తీవ్రంగా వ్యతిరేకిన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో రష్యా మాత్రం భారత్‌కు మద్దుతుగా నిలుస్తోంది. ఇదే సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## కర్తవ్యభవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



2లో

దేశ రాజధాని ఢిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది: రాహుల్ గాంధీ



2లో

## ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా: కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు.

మిగతాద్ది 2 లో

## రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది: సుప్రియా సూలే



వివరాలు 2 లో..

# బిసి రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష





బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే.. ప్రధాని మోదీని గద్దెదించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని.. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులకు ఆమోదం తెలకపపోతే ప్రధాని మోడీని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినా మోడీ ప్రధాని పదవి వదులుకోవడం లేదని.. 75 ఏళ్ల నిబంధన ఆయనకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ గద్దె దిగినా.. దిగకపోయినా.. 2029లో మేమే ఆయనను గద్దె దింపి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుంటామని..ఇదే మా శపథమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు.

మిగతాద్ది 2 లో

»తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంది?

»42శాతం రిజర్వేషన్లు ఇస్తారా..గద్దె దింపాలా?

»మోడీపై నేరుగా విమర్శలు గుప్పించిన సిఎం రేవంత్

»ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాల ఉద్వేగ పూరిత ప్రసంగం

»బిజెపి, బిఆర్ఎస్ తీరును తూర్పారా పట్టిన రేవంత్ రెడ్డి

## బీసీ సబ్‌ప్లాన్‌పై ఒత్తిడి తెస్తాం


: భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్



హైదరాబాద్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రాష్ట్ర భాజపా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.

2 లో

## మహిళా ఎమ్మెల్యే పట్ల కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటు: హరీశ్‌రావు



హైదరాబాద్: మొట్టమొదటి మహిళా హోం మంత్రి, సీనియర్ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాజీమంత్రి హరీశ్‌రావు ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకొంటూ మహిళా సభ్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

వివరాలు 2 లో..

# సంపాదకీయం

## ప్రశ్నార్థకమవుతున్న ఈసీ విశ్వసనీయత

'భారతదేశంలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చచ్చిపోయింది..' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో 1.5 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని తమ దర్యాప్తులో తేలిందని, ఈ విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా త్వరలో నిరూపిస్తామని ఆయన ప్రకటించారు. అనేక విషయాల్లో రాహుల్‌గాంధీ అడపాదడపా చేసే ఆరోపణలు సంచలనాత్మకంగా ఉంటున్నాయి. అవి, కొన్నిసార్లు న్యాయస్థానం విమర్శలకు గురైనప్పటికీ ఎన్నికల కమిషన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ఇదే సమయంలో బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) జరుగుతున్న తీరుపై కొద్ది రోజులుగా పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోయాయి. ఎన్నికల కమిషన్ పనితీరుపై పార్లమెంట్‌లో చర్చించడం సంప్రదాయాలకు విరుద్ధమని, గతంలో బలరాం జాఖడ్ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈ మేరకు రూలింగ్ ఇచ్చారని ఉభయ సభల అధిపతులు వాదిస్తున్నారు. అయినప్పటికీ బిహార్‌లో జరుగుతున్న ఎస్‌ఐఆర్‌ను ప్రతిపక్షాలు అంత సులభంగా వదిలిపెట్టే అవకాశాలు కనిపించడం లేదు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కేసుపై విచారణలో ఎస్‌ఐఆర్ జరుగుతున్న తీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఎన్నికల కమిషన్ ఓటర్ల పౌరసత్వంపై దృష్టి కేంద్రీకరించడం, కొత్త ఓటర్లను చేర్చుకోవడం కాకుండా ఉన్న ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఎన్నికల జాబితాలో నమోదు చేసుకోవాలంటే ఒక వ్యక్తికి భారతీయ పౌరసత్వం ఉండాలని, కేవలం భారతీయ పౌరులనే ఓటర్లుగా చేర్చుకోవడం తమ బాధ్యత అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఓటర్లుగా నమోదు కావాలంటే 11 డాక్యుమెంట్లు సమర్పించాలని, 1987 నుంచి 2004 మధ్య పుట్టినవారు తమ తల్లిదండ్రుల్లో ఒకరి డాక్యుమెంట్‌ను, 2004 తర్వాత పుట్టినవారు తల్లి, తండ్రి ఇరువురి డాక్యుమెంట్లనూ సమర్పించాలని చెబుతోంది. కేంద్రం జారీ చేసిన ఆధార్, తాము జారీ చేసిన ఎన్నికల గుర్తింపు కార్డులను కూడా ఈసీ పరిగణనలోకి తీసుకోవడం లేదు.

పౌరసత్వం ఆధారంగా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం పేరుతో ఎన్నికల కమిషన్ అధికార పార్టీని గెలిపించేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. పౌరసత్వ సర్టిఫికెట్ జారీ చేయడం ఎన్నికల కమిషన్ పని కాదని, ఎన్నికలను పర్యవేక్షించే, నిర్వహించే రాజ్యాంగ బాధ్యత మాత్రమే కమిషన్‌కు ఉన్నదని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా కూడా వాదిస్తున్నారు. నిజానికి 2025లో ఓటర్ల జాబితా ప్రకటించేందుకు ముందే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేసి ఉంటే ఎన్నికల కమిషన్ ఇంత వివాదంలో ఇరుక్కునేది కాదు. బిహార్‌లో ఎన్నికలు సరిగ్గా రెండు మూడు నెలల్లో జరుగుతాయనగా ఆగమేఘాలపై కేవలం నెలలోపు ఈ సవరణ చేసేందుకు పూనుకోవడమే కమిషన్ నిజాయితీని శంకించేలా చేస్తోంది. ఒక రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ దేశంలో చాలా కాలంగా వివాదంలో ఉంటూనే వస్తోంది. 1990లో టీఎన్ శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ అయిన తర్వాత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో కీలక మార్పులు తీసుకువచ్చారు. డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, గోడలపై రాతల్ని రాయడంతో పాటు ఎన్నికల ప్రసంగాల్లో మతాన్ని ఉపయోగించడాన్ని కట్టుదిట్టంగా అరికట్టారు. ఓటర్ల ఐడీ కార్డులను, ప్రవర్తనా నియామావళిని ప్రవేశపెట్టారు. ఎన్నికల ఖర్చులపై పరిమితిని విధించారు. ఎన్నికలకు ఎన్ని వాహనాలు ఉపయోగించారో కూడా అభ్యర్థులు లెక్క చెప్పాల్సి వచ్చేది. రిటర్నింగ్ అధికారులు ఈ వాహనాల మీటర్లను చెక్ చేసి ఎన్నికల ఖర్చులపై రోజువారీ లెక్కలతో సరిపోల్చేవారు. ఎన్నికల ముందు యూపీతో పాటు అనేక రాష్ట్రాల్లో 3లక్షల మందికి పైగా రౌడీషీటర్లని ముందస్తు అరెస్టులు చేయించిన శేషన్ ఒక దశలో ఓటర్లను ప్రలోభపెట్టినందుకు ఇద్దరు కేంద్రమంత్రులను తొలగించాల్సిందిగా ప్రధానమంత్రికే తాఖీదు పంపారు. శేషన్ హయాంలో పోలింగ్ బూత్‌ల స్వాధీనం, ఎన్నికల సంబంధిత దాడులు, దొమ్మీలు, హత్యలు 90 శాతం పైగా తగ్గిపోయాయి. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న విషయంపై ఆయనే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారు. 'ఇప్పటి వరకూ రాజకీయ నాయకులు చాలా చెత్తపనులన్నీ చేశారు. నేను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నంతకాలం ఎన్నికలు ఎలా నిర్వహించాలో నేనే నిర్ణయిస్తాను..' అని శేషన్ ప్రకటించారు. 'ఈ శేషన్ ఘటోత్కచుడిలా ఉన్నాడే..' అని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల వ్యవస్థకు విశ్వసనీయత సాధించినందుకు ఆయనకు రామన్ మెగసెసే అవార్డు లభించింది. కాని శేషన్ అనంతరం మళ్లీ పరిస్థితులు క్రమంగా మొదటికి రావడం ప్రారంభమైంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ నవీన్ చావ్లా వంటి అస్మదీయులను కమిషనర్లుగా నియమించారు. శేషన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, కట్టుదిట్టంగా అమలు చేసిన నిబంధనలన్నీ ఇప్పుడు నీరుకారినట్లు అనిపిస్తున్నాయి. అన్ని వ్యవస్థల మాదిరే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. డబ్బు, మద్యం, రెచ్చగొట్టే ఉపన్యాసాలతో పాటు అనేక అవలక్షణాలు ఎన్నో మళ్లీ ప్రవేశించాయి. అధికారంలో ఉన్న రాజకీయనాయకుల ఆగడాలపై శీతకన్ను వేసే పరిస్థితి స్పష్టంగా కనపడుతోంది.గత కొన్నేళ్లుగా ఎన్నికల కమిషన్‌పై రకరకాల ఆరోపణలు వస్తున్నాయి. పోలైన ఓట్ల శాతాన్ని ప్రకటించడంలో విపరీతమైన ఆలస్యం చేయడం, అంచనాలను అధిగమించి అత్యధిక ఓట్లు పోలయ్యాయని ప్రకటించడం, లెక్కపెట్టిన ఓట్లు, పోలైన ఓట్లకు పొంతన లేకపోవడం, ఓటర్ల జాబితాలో పేర్లు మాయం కావడం లాంటి అనేక ఆరోపణలు వచ్చాయి. 2014 నుంచీ ఇప్పటి వరకూ ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అంతర్గత కారణాల వల్ల కమిషన్‌కు రాజీనామా చేసి వెళ్లడం కూడా కొట్టిపారేయదగిన విషయం కాదు. 2018లో మధ్యప్రదేశ్‌లోను, 2024లో మహారాష్ట్రలోనూ భారీ ఎత్తున బోగస్ ఓటర్లను చేర్చారన్న ఆరోపణలు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ ఇప్పుడు ఆరోపిస్తున్నారు. బిహార్‌లో ఎస్‌ఐఆర్‌ను నిర్వహిస్తున్న వేలాది మంది స్థానిక ఈఆర్‌ఓలు, క్రింది స్థాయి సిబ్బంది ఓటర్ల జాబితాలో చేసే మార్పులపై ఇప్పుడు ప్రతిపక్షాలు దృష్టి సారిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత మాట అటుంచితే తాము ఓడిపోయినందుకు కారణాలు వెతుక్కోవడం ప్రతిపక్షాల నైజం. గతంలో బీజేపీ కూడా ఓడిపోయినప్పుడల్లా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించేది. అదే సమయంలో తాము గెలిచిన నియోజకవర్గాల్లో అక్రమాలు జరిగాయని ఏ పార్టీ ఆరోపించదనేది సత్యం.ఎన్నికల్లో ఒక పార్టీ ఓడిపోవడానికి ప్రజా వ్యతిరేకత ప్రధాన కారణం. ప్రజా వ్యతిరేకత ఏ మాత్రం ఉన్నా మిగతా కారణాలు కూడా ఆ పార్టీ ఓటమిని మరింత బలపడేలా చేస్తాయి. చాలా చోట్ల ప్రజలు తమ వ్యతిరేకతను పైకి వ్యక్తం చేయరు. 'నా నియోజకవర్గంలో ఒక గ్రామంలో నేను ఎప్పుడు వెళ్లినా నన్ను ప్రేమగా బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారీ నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. దీనితో నేను ఓడిపోతానని అర్థమైంది' అని సీనియర్ కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒక సందర్భంలో చెప్పారు.

# బిసి రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష

మొదటిపేజీ తరువాయి

50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టాం అని అన్నారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు మాత్రమే ఉంటుంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తే దేశ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు ఇస్తున్నారు. అదే విధంగా ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్దతు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పార్లమెంటులో మోదీ సర్కార్?తో కొట్లాడుతామని ధర్నాకు వచ్చి అండగా నిలిచారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసి దేశానికి రాహుల్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని అంటూ, ఆ హామీ మేరకు 42శాతం చట్టం చేశామని అన్నారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం మేము చేశాం. కేబినెట్ మంత్రులు నాకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేసే అవకాశం నాకు కల్పించారు. దేశానికే ఆదర్శంగా



నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని అందిపుచ్చుకుని.. జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని

రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు. దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా?మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది?తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా?ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా?పేరు బంధం తెగిన తెరాస పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే.. ఆ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయని ఫైర్ అయ్యారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో మేం బిల్లులు ఆమోదిస్తే.. మా బిల్లును తుంగలో తొక్కే హక్కు మీకు ఎవరిచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ పేరుతో కాంగ్రెస్ డ్రామాలేస్తుందని డ్రామారావు అంటుండు. కానీ డ్రామాలు ఆడేదే కల్వకుంట్ల ఫ్యామిలీ అని తెలంగాణ రాష్ట్రమంతా తెలుసని రేవంత్ కౌంటర్ ఇచ్చారు. డ్రామా మీ కుటుంబంలో ఉంటే.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి మాకుందన్నారు. మీ ఇంట్లనే పరిస్థితి సక్కగ లేదు. ఒకరు బీసీలకు మద్దతు అంటారు.. ఇంకొకాయన అసలు మాట్లాడరు.. మరొకరు మధ్యరకం అంటారు.. అటు–ఇటు– గానీ వాళ్లు నా గురించి మాట్లాతారా అని ఫైర్ అయ్యారు.వంద మీటర్ల గోతి తొవ్వి పాతిపెట్టినా మీకు బుద్ధి రాలేదని బీఆర్ఎస్‌ను కడిగిపారేశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీఆర్ఎస్.. ఆ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన మహాధర్నాకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.బీసీల ఓట్లు– మీకు అవసరం లేదా.. బలహీనవర్గాల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు నిలదీయట్లేదని ప్రశ్నించారు.

బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆ చట్టాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని.. ఆ ఆర్డినెన్స్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందన్నారు. ఈ ధర్నాలు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యలే తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా: కేంద్రమంత్రి బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు. బీసీ ముసుగులో ముస్లింలకు 100శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్ధతు కరవైందని ఎద్దేవా చేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా బీసీని ప్రధాని చేశారా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? చెప్పాలన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో, నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా అన్నారు. ఎంతమంది బీసీలకు ఎంపీ సీట్లు ఇచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నించారు. మీరా.. బీసీల గురించి మాకు నీతులు చెప్పేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత భాజపాదేనన్నారు. 27 మంది బీసీ కేంద్ర మంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత భాజపాకే దక్కుతుందన్నారు. కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల నుంచి తప్పుకోవాలనుకుంటున్న కాంగ్రెస్.. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కనుమరుగవడం తథ్యమని హెచ్చరించారు.

## బీసీ సబ్‌ప్లాన్‌పై ఒత్తిడి తెస్తాం: భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్



మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రాష్ట్ర భాజపా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బిల్లు పెట్టి.. దిల్లీలో ధర్నా చేస్తారని తాము అసెంబ్లీలోనే చెప్పామని వ్యాఖ్యానించారు.

"ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికీ కాంగ్రెస్ స్పష్టత ఇవ్వట్లేదు. తెలంగాణ వచ్చినప్పుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి.. ఇప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తే బీసీలకు వచ్చేది 32 శాతమే.. అంటే గతం కంటే 2 శాతం తక్కువ. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎక్కడ అమలు చేస్తున్నారో రాహుల్ గాంధీ చెప్పాలి. రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దిల్లీలో కాంగ్రెస్ చేస్తోన్న ధర్నా బీసీల కోసం కాదు.. ఆ ధర్నాలో బీసీలు లేరు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్‌ప్లాన్‌పై ఒత్తిడి తెస్తాం"అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.

## రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది: సుప్రియా సూలే

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: సీఎం అవుతానని రేవంత్‌రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని.. కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మాత్రమే చెప్పారని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. ఒక కార్యకర్త.. జీరో నుంచి సీఎం వరకు ఎదిగారని చెప్పారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చేపట్టిన ధర్నాకు సుప్రియా సూలే, డీఎంకే ఎంపీ కనిమొళి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రియా సూలే మాట్లాడారు.

"వంచితులు, పీడితుల తరఫున రేవంత్‌రెడ్డి పోరాడుతున్నారు. దేశంలో తొలిసారి 69 శాతం రిజర్వేషన్లను కరుణానిధి అమలుచేశారు. అంబేద్కర్ మాదిరిగానే కరుణానిధి పేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి పేరు కూడా చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాంగ్రెస్‌తో శరద్‌పవార్‌కు మంచి అనుబంధం ఉంది. కాంగ్రెస్‌కు మా పార్టీ అండగా నిలుస్తుంది" అని సుప్రియా సూలే అన్నారు.

## బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది: రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు.

"కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసమే కాదు.. దేశంలోని అణగారిన వర్గాలందరి కోసం. ఈ ధర్నాకు హాజరైన ఇండియా కూటమి నేతలకు ధన్యవాదాలు"అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## బీసీ సబ్‌ప్లాన్‌పై ఒత్తిడి తెస్తాం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో బిల్లు పెట్టి.. దిల్లీలో ధర్నా చేస్తారని తాము అసెంబ్లీలోనే చెప్పామని వ్యాఖ్యానించారు. "ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికీ కాంగ్రెస్ స్పష్టత ఇవ్వట్లేదు. తెలంగాణ వచ్చినప్పుడు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి.. ఇప్పుడు ముస్లింలకు 10శాతం ఇస్తే బీసీలకు వచ్చేది 32 శాతమే.. అంటే గతం కంటే 2 శాతం తక్కువ. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎక్కడ అమలు చేస్తున్నారో రాహుల్ గాంధీ చెప్పాలి. రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దిల్లీలో కాంగ్రెస్ చేస్తోన్న ధర్నా బీసీల కోసం కాదు.. ఆ ధర్నాలో బీసీలు లేరు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్‌ప్లాన్‌పై ఒత్తిడి తెస్తాం"అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.

## మహిళా ఎమ్మెల్యే పట్ల కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటు: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడమే సబిత చేసిన తప్పా అని ప్రశ్నించారు. మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీలుగా బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వారితో కలిసి మహిళా ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. ఆమెపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లు, రౌడీ మూకల దాడులకు భారత రాష్ట్ర సమితి భయపడదన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, ప్రజాక్షేత్రంలో వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని హరీశ్‌రావు తెలిపారు.


# కొంపల్లిలో ఏడు పబ్‌లకు ఈగల్ నోటీసులు


**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్‌లో బయటపడిన డ్రగ్స్ కేసులో మరో ఇద్దరిని ఈగల్ బృందం అరెస్ట్ చేసినట్టు ఎస్పీ రూపేశ్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 10 మందిని అరెస్ట్ చేశారు. 7 పబ్‌లకు నోటీసులు జారీ చేయగా, 4 యజమానులు వివరణ ఇచ్చారు. మత్తు పార్టీల్లో పాల్గొన్నవారికి పరీక్షలు జరిపి, నెగటివ్ కాకపోతే కేసులు పెడుతున్నారు. కొందరు విదేశాలకు పరారైనట్టు సమాచారం.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు నుంచి జనావాసాల్లోకి విషవాయువులు





**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనతో జీవిస్తున్నామని వాపోయారు. రోజు చీకటి పడగానే భారీ పరిమాణంలో పైపుల నుండి విషవాయువులు విడుదల అవుతున్నాయని చర్లపల్లి కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. చర్లపల్లి, ఘట్కేసర్, కాప్రా ప్రాంతాల మధ్య మబ్బులను తాకుతున్నట్లు కనిపిస్తున్న ఈ విషవాయువులతో శ్వాస సంబంధిత ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మూడేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు ఇస్తున్న బ్యాంకులివే

– చిలకమర్రి రమణమూర్తి,
రిటైర్డ్ AGM తెలంగాణ గ్రామీణ బ్యాంక్



మీరు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకుంటున్నారా? అయితే కొన్ని బ్యాంకులు మూడేళ్ల ఎఫ్డీలకు అధిక వడ్డీ రేట్లు అందిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, కోటక్ మహీంద్రా, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్.. అధిక ఎఫ్డీ వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. సాధారణ పౌరులకు, సీనియర్ సిటిజన్లకు వివిధ శాతాల్లో వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నాయి.

# కేంద్రం పారాసెటమాల్ టాబ్లెట్లను నిషేధించలేదు



**కరపత్రం ఢిల్లీ బ్యూరో**

పారాసెటమాల్‌పై నిషేధం లేదని కేంద్రం స్పష్టం చేసింది. దీనిపై ఇటీవల వచ్చిన వార్తలు పుకార్లేనని కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ పార్లమెంటులో తెలిపారు. సాధారణ జ్వరం తదితర సమస్యలకు వినియోగించే ఈ ఔషధంపై ఎలాంటి ఆంక్షలు లేవని చెప్పారు. అయితే, పారాసెటమాల్‌ను ఇతర ఔషధాలతో కలిపి తయారు చేసిన కొన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్లను గతంలో నిషేధించినట్లు గుర్తు చేశారు.సౌజన్యం: సంజయ్ సింగ్, గ్రౌండ్ జీరో సే

# మున్నూరు కాపు సంఘానికి ఎంపీ నిధులు ఐదు లక్షలు



**కరపత్రం ప్రతినిధి మల్యాల ఆగస్టు**

మల్యాల మండల కేంద్రం లోని మునురుకపు సంఘానికి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ఎంపీ ల్యాండ్స్ నుంచి 5 లక్షల రూపాయలు సంఘ భవనానికి కేటాయించడం జరిగింది. దాని ప్రొసీడింగ్ లెటర్ మల్యాల మండల అధ్యక్షులు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మునురుకాపు అధ్యక్షుడు ముద మల్లేశం గారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు. బొట్ల ప్రసాద్. బైరి విజయ్. గుండేటి గంగారం. నల్ల జీవన్ రెడ్డి. భూమేష్. మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు

# కరీంనగర్‌లో భారీ కార్డన్ & సెర్చ్ ఆపరేషన్

## 87 వాహనాల తనిఖీ, 25 వాహనాలు స్వాధీనం

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**

కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు.ఈ తనిఖీల్లో మొత్తం 87 వాహనాలను పరిశీలించగా, సరైన పత్రాలు లేని 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 24 బైకులు, ఒక కారు ఉన్నాయి. అదేవిధంగా, నంబర్ ప్లేట్లు లేని 8 వాహనాలు, ఒకే నంబర్ ప్లేట్ కలిగిన 25 వాహనాలు గుర్తించగా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై 27 వాహనాలకు జరిమానాలు విధించారు.సామాజిక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహణ..ఆపరేషన్ సందర్భంగా పోలీసు బృందం స్థానిక ప్రజలకు, విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించింది:

### సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ నేరాలు ఎదురైన వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా నష్టాన్ని తక్కువ చేయవచ్చని పోలీసులు సూచించారు.

### మాదకద్రవ్యాలపై హెచ్చరిక

డ్రగ్స్ వినియోగం, సరఫరా చట్టరీత్యా నేరమని,




యువత దాని వలలో పడకూడదని హితవు పలికారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు వివరించారు.

### షీ టీమ్ సూచనలు:

షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి శ్రీలత మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద సందేశాలు వచ్చినప్పుడు, ఫోటోలు పంపకూడదని, వేధింపులకు గురైన వారెవ్వరూ భయపడకుండా షీ టీమ్‌ను ఆశ్రయించాలని సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ట్రాఫిక్ నిబంధనలు:ప్రమాదాలను నివారించాలంటే ట్రాఫిక్



నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలపై హెచ్చరిక

చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. అలాంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, సృజన్ రెడ్డి, సదన్ కుమార్, శ్రీలత, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మొత్తం 150 మంది పోలీసు సిబ్బంది, 300 మంది స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు.

# పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి పై దృష్టి సారించాలి.

– జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**కరపత్రం ప్రతినిధి బాసర ) ఆగస్టు 06**

నిర్మల్ జిల్లా :-విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధన కొనసాగించాలన్నారు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్. బుధవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామ ప్రభుత్వ జడ్పీ హై స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించి, విద్యార్థుల హాజరుతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల సరఫరాపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారికి పాఠాలు చదివించడంతో పాటు లెక్కలు చేయించారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటినుంచే పకడ్బందీగా సన్నద్ధమవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన భారతదేశ భౌగోళిక పటాన్ని



పరిశీలించి మెచ్చుకున్న కలెక్టర్, ప్రతి పాఠశాలలో ఇలాంటి పటాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని ప్రతిరోజూ అందించాలన్నారు. వంటకు కట్టెల పొయ్యి బదులుగా ఎల్పీజీ వాడాలని సూచించారు. వంటగది, డైనింగ్ హాల్, నిల్వ గదులు పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి విద్యార్థిని అక్షయ కలెక్టర్ ఫోటో ఆధారంగా గీసిన బొమ్మను అందించగా, కలెక్టర్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసిన కలెక్టర్, వాటి సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కూరగాయల విత్తనాలను నాటారు. అక్కడ పండే కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బురద రాజకీయాలు మానుకోవాలి

– ఆప్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు
సయ్యద్ హైదర్

**కరపత్రం ప్రతినిధి బాసర ) ఆగస్టు 06**

నిర్మల్ :-బీజేపీ బురద రాజకీయాలు మానుకోవాలి ఆప్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ విషయంలో ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పు, మూడు సంవత్సరాల క్రితం బీజేపీ ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐని ఉపయోగించి అవినీతి ఆరోపణల కేసులో సత్యేంద్ర జైన్ ని అరెస్ట్ చేయించిందన్నారు. ఆ కేసులో తగిన ఆధారాలు చూపించడంలో సీబీఐ పూర్తిగా విఫలమైందని కోర్టు స్పష్టం చేసిందన్నారు. సీబీఐ సమర్పించిన తుది నివేదికను, ఎఫ్ఐఆర్‌ను పరిశీలించిన తర్వాత, సత్యేంద్ర జైన్ నిర్దోషి అని, ఆయనపై చేసిన



ఆరోపణలను రుజువు చేసే సాక్ష్యాధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు ఇచ్చారన్నారు. ఈ తీర్పుతో బీజేపీ యొక్క నిజ స్వరూపం మరోసారి బయటపడిందని, బీజేపీ అంటే 'బురద జల్లే పార్టీ' అని ఈ కేసు ద్వారా రుజువైందన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ, రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఈ ఘటన నిరూపిస్తుందన్నారు.ఒకరిని అరెస్టు చేయాలంటే కేవలం అనుమానం ఉంటే సరిపోదని, అందుకు బలమైన ఆధారాలు ఉండాలని కోర్టు గట్టిగా చెప్పిందని, ఇది బీజేపీకి చెంపపెట్టు లాంటిదన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎప్పుడూ నిజాయితీ, పారదర్శకతతో పనిచేస్తుందని, అబద్ధపు కేసులతో మా నాయకులను భయపెట్టాలని చూస్తే, మేము న్యాయపోరాటం చేసి విజయం సాధిస్తామని అన్నారు. ఇకనైనా బీజేపీ బురద చల్లే రాజకీయాలు మానుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వినోద్ కుమార్, అబ్దుల్ సాదిక్, సోఫీ వాహద్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి ఆధారం: కలెక్టర్ పమేలా సత్పతి

– తొలి గంటలోపే ముర్రుపాలు
తాగించాలి తల్లిపాల వారోత్సవాల్లో
అవగాహన కార్యక్రమం

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**

తల్లిపాలతో శిశువుకు రోగ నిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యంగా పెరుగుతారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు తాగించాలి. తొలిచుక్కే శిశువు జీవితానికి బలం. మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలి. ఆహార పోషణ కోసం ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా లభించే పోషకాహారాన్ని వినియోగించుకోవాలి అని సూచించారు.అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ మాట్లాడుతూ,శిశువుకు కనీసం ఏడాది పాటు తల్లిపాలు ఇవ్వాలని తల్లులు పట్టుదలగా ఉండాలి. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి వైద్యుల సూచనలను పాటించాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో చల్మెడ వైద్య కళాశాల విద్యార్థులు తల్లిపాల ప్రాధాన్యాన్ని నాటక రూపంలో చూపించి ఆకట్టుకున్నారు. బాలింతలు, గర్భిణుల కోసం ప్రత్యేక అవగాహన చర్చలు నిర్వహించారు. అనంతరం పలువురు బాలింతలకు పండ్లు పంపిణీ




చేశారు.కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డా. వీరారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆర్ఎంవో నవీన్, సనా, సిడిపిఓ సబిత తదితరులు పాల్గొన్నారు.

# మల్యాల మార్కెట్ యార్డ్ లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిధి మల్యాల ఆగస్టు**

మల్యాల మార్కెట్ యార్డ్ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధుడు జై శంకర్ అని ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్. గందె కోటేష్ మారుతి తదితరులు పాల్గొన్నారు

# సోదరభావం, పవిత్రతే రక్షాబంధన్ సందేశం






– బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్:**
ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెదలాలనే సందేశాన్ని తెలియజేయడమే రక్షాబంధన్ ఉద్దేశ్యమని బ్రహ్మకుమారీలు శ్రీవాణి అన్నారు. బుధవారం రాఖీ పండగ విశిష్టతను వివరిస్తూ పట్టణంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ లో పలువురికి రాఖీలు కట్టారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ రమేష్ బాబు, తహసిల్దార్ కనకయ్య, సబ్ ట్రెజరీ అధికారి శివరామకృష్ణ, డిప్యూటీ తహసిల్దార్ సాయి, ఆర్ఐ రంజిత్ రెడ్డి, శేఖర్ లతో పాటు సిబ్బందికి రాఖీలు కట్టారు. రాఖీ యొక్క విశిష్టతను తెలియజేస్తూ అక్కా చెల్లెలు, అన్నదమ్ముల బంధం గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన మన దేశంలో ప్రతి పండుగ పరమాత్ముని అవతరణ, దివ్య కర్తవ్యాన్ని సూచిస్తుందన్నారు. రక్షణ అంటే విలువలను పెంపొందించుకోవడం, మనం ఏర్పరచుకున్న విలువలను కాపాడుకుంటూ జీవించడం అన్నారు. పరస్పర మాటలు, దృష్టి స్వభావ సంస్కారాలు నిష్కల్మషంగా ఉండాలనే రాఖీ కట్టి మిఠాయి తినిపిస్తారని తెలిపారు. ప్రజలందరూ పరమాత్ముని యందు సంపూర్ణ నిష్ఠ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రాణి, రాజయ్య, నిరంజన్, హుజురాబాద్ పోస్ట్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంజుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్వప్న మహేష్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. ఆ తర్వాత ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తి, గ్రామీణ అభివృద్ధిపై అవగాహన పెంపొందించేలా జయశంకర్ జీవితం, సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు...




**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 6**
తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు జమ్మికుంట మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అధ్యక్షతన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ విదేశాల్లో తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా వ్యాప్తిచేయడంలో ఆయన పాత్ర మరవలేనిదన్నారు. విద్యార్థి దశ నుంచే తెలం'గానం'ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి అని ఆయన అన్నారు. 1952 నాన్ ముల్కీ ఉద్యమంలోకి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించారన్నారు. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మేధావి కొత్తపల్లి జయశంకర్ అని, అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించే మహనీయుడు జయంశకర్ అన్నారు. తెలంగాణ డిమాండ్‌ను 1969 నుంచి సునిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసారన్నారు. తెలంగాణలోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గుత్ప అందుకున్నదని, ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికలమీద, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినిపించిన పోరాట శీలి ప్రొఫెసర్ జయశంకర్ అని కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఆయన చూపిన అడుగుజాడల్లో నేటి యువత నడవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ లు భాస్కర్, వాణి, శ్రీనివాస్, ఏఈ వికాస్, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్ లతో పాటు వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత



– సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ

**కరపత్రం ప్రతినిధి జ్యోతినగర్ (రామగుండం) ఆగస్టు 06:**

మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత అని సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో విక్టరీ ఫ్యాషన్ టెక్నాలజీ ఎన్టీపీసీ జ్యోతినగర్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ మహిళల హక్కులు, అంగన్వాడీ సేవలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, సఖి సేవలు, టోల్ ఫ్రీ నెంబర్స్, ఉన్నత విద్యా, లింగ వివక్షత, బాల సదనం సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విక్టరీ ఇన్స్టిట్యూట్ యజమానులు వరలక్ష్మి, అధ్యాపకులు శ్రీజ, అనూష, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్

– రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్




**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 06:**
తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా... ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిర్వహించారు. జయశంకర్ కు ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు 1969 తెలంగాణ ఉద్యమం, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్, నాన్ ముల్కీ ఉద్యమం, మలిదశ తెలంగాణా ఉద్యమం లో పాల్గొని దేశ వ్యాప్తంగా వేదికల ద్వారా తన ప్రసంగాలతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి తెలియజేశారని తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ ప్రజలకు నీళ్లు, నిధులు, నియామకాలు అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని తెలంగాణ ఉద్యమ నాయకునికి ఎన్నుకొని ఉద్యమ కార్యాచరణ రూపొందించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కృషి చేశారన్నారు. కోట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు సాధించే దిశగా ప్రో? జయశంకర్ ఆశయాలను కొనసాగించే దిశగా కేసీఆర్ ముందుకు సాగారని తెలిపారు. జయశంకర్ సార్ కలలుగన్న బంగారు తెలంగాణ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి కోటి ఎకరాలకు సాగు నీరు అందించే ప్రయత్నం చేశారని అన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నీరుగారుస్తూ కన్నెపల్లి పంపు హౌజ్ నుండి నీటిని ఎత్తిపోసి అవకాశం ఉన్నా నీటిని ఎత్తిపోయకుండా రైతుల పొలాలను ఎండబెడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవు ఐలయ్య యాదవ్, మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, బాదే అంజలి, జనగామ కవిత సరోజినీ, గుర్రం పద్మ, కనకలక్ష్మి, సుజాత, పర్లపల్లి రవి, జెవి రాజు, చల్లా రవీందర్ రెడ్డి, కిరణ్ జీ, నీరటి శ్రీనివాస్, వెంకటేష్, పిల్లి రమేష్, రామరాజు, హరికృష్ణ, శ్రీనివాస్, శ్రావణ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టిపిసి లో తల్లిపాల వారోత్సవాలు




**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఆగస్టు 6:**
తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని రామగుండం సెక్టార్ ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీ అంబేద్కర్ భవన్ లో తల్లి పాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు, ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన, 3 సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ అలేఖ్య, సూపర్వైజర్ లక్ష్మి, అంగన్వాడి టీచర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# హాలో బీసీ ఛలో డిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రణవ్..

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ ఆగస్టు 6**



– బీసీలకు 42 శాతానికి కట్టుబడి ఉన్నాం.
– బీసీల పట్ల చిత్తశుద్ధి ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్.




కాంగ్రెస్ పార్టీ బీసీల రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని,దానికి మద్దతుగా అసెంబ్లీ లో,క్యాబినెట్ లో తీర్మానం చేసి పార్లమెంట్ ఆమోదానికి పంపామని కేంద్రంలోని బీజేపీ లోకసభలో బీసీ రిజర్వేషన్ చేయించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ తో పాటు రాష్ట్ర టీపీసీసి ఉపాధ్యక్షులతో పాటు పాల్గొన్నారు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలుకు కట్టుబడి బిల్లుకు ఆమోదం తెలిపి రాష్ట్రపతి,గవర్నర్ దగ్గరికి పంపామని వెంటనే ఆమోదం తెలిపాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్ లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని ఇంచార్జ్ అడ్మిన్ మల్లారెడ్డి ఏసీపీ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం రామగుండం పోలీసు కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, పోలీస్ సిబ్బంది ప్రొ.జయశంకర్ చిత్రపటం వద్ద పూలను వుంచి తమ నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ అడ్మిన్ మల్లారెడ్డి ఏసీపీ మాట్లాడుతూ సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు 1969 తెలంగాణ ఉద్యమం, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్, నాన్ ముల్కీ ఉద్యమం, మలిదశ తెలంగాణా ఉద్యమం లో పాల్గొని దేశ వ్యాప్తంగా వేదికల ద్వారా తన ప్రసంగాలతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి తెలియజేశారు అని తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మరింత మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ లు చంద్ర శేఖర్ గౌడ్, భీమేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, దామోదర్, మల్లేషం, వామన్ మూర్తి, సూపరింటెండెంట్లు ఇంద్ర సేనా రెడ్డి, సందీప్, సంధ్య, సీసీ హరీష్ సిపిఓ సిబ్బంది, వింగ్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.